డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

**విలేకరులు కావలెను..**
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

పెద్దపల్లి | శుక్రవారం | 06 -02 -2026 | సంపుటి: 01 | సంచిక : 19 | పేజీలు : 08 | వెల :02/-
Peddapalli | Friday | 06 -02-2026 | Volume: 01 | Issue: 19 | Pages: 08 | Cost :02/-

## లోక్‌సభలో అరుదైన పరిణామం



- ప్రధాని ప్రసంగం లేకుండానే ధన్యవాద తీర్మానం ఆమోదం.
- మోదీపై దాడి ప్లాన్ అన్న సమాచారం.
- సభ వాయిదా వెనుక భద్రతా కారణాలు.
- జాతీయ మీడియాలో కథనాలు.

2

## సస్పెన్షన్‌కు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన




2

## వరంగల్ కరీంనగర్ జంట నగరాలుగా
# అభివృద్ధి చేస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి.
- ఔటర్ రింగ్ రోడ్లు, డంప్ యార్డ్, విద్యుత్ కేంద్రం ప్రణాళిక.
- చొప్పదండిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
- గోదావరి పుష్కరాల నాటికి దేవాలయాల సమగ్ర అభివృద్ధి.
- సంక్షేమంఉపాధిమహిళా సాధికారతపై దృష్టి.



**జనం వాయిస్, కరీంనగర్:** వరంగల్‌కరీంనగర్ పట్టణాల సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళికను గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ రెండు పట్టణాలకు ఔటర్ రింగ్ రోడ్లను పూర్తి చేసి, వాటిని అనుసంధానించేలా రహదారులను విస్తరించనున్నట్లు తెలిపారు. వరంగల్‌కరీంనగర్ మధ్య అతి పెద్ద డంప్ యార్డ్ ఏర్పాటు చేసి, అక్కడే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్‌లో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి బాట" కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పదండిలో రూ. 45. 15 కోట్లతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు, అలాగే గంగాధర మండలంలో రూ. 5 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన మిగతా 2 లో...

## పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం



- తెలంగాణ జనసేన నేతలతో సమావేశం.
- 7, 8 తేదీల్లో ప్రచారంలో పాల్గొంటానన్న ప్రకటన.
- జనసేన అభ్యర్థులు, బీజేపీకి మద్దతు.
- ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలని సూచన.

**జనం వాయిస్, హైదరాబాద్:** ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ జనసేన నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహం, ప్రచార కార్యాచరణపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల మిగతా 2 లో...

## ఎంపీ అరవింద్ వ్యాఖ్యలకు టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్



3

## ప్రజలను భయపెడుతున్న పెద్దపులి

3



## రైతు బంధుపై కాంగ్రెస్ మోసం

- సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ తీవ్ర విమర్శలు.
- అడ్డగోలు హామీల అమలు ఎక్కడ?.
- జిల్లాల రద్దుపై కుట్ర ఆరోపణ.
- కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయాలన్న పిలుపు.



**జనం వాయిస్, సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుబంధు వేస్తామని సీఎం చెబుతున్నారని, అయితే ఇప్పటివరకు మిగతా 3 లో...

## పేద, బడుగు వర్గాల హక్కుల కోసం పోరాటం

- వనపర్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తీన్మార్ మల్లన్న
- 13వ వార్డులో ఇంటింటి ప్రచారం
- పారదర్శక పాలన తీసుకొస్తామన్న హామీ
- టీఆర్పీకి అవకాశం ఇవ్వాలని పిలుపు

3





3

## హుజూరాబాద్ అభివృద్ధే బీజేపీ లక్ష్యం

- కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్.
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఘాటు విమర్శలు.
- కేంద్ర నిధులతో హుజూరాబాద్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి.
- మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కితే పెండింగ్ పనుల పూర్తి.
- ఆలోచించి బీజేపీని గెలిపించాలన్న పిలుపు.

## సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్‌ను వెనక్కి తీసుకోవాలి

- హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి లేఖ రాసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.
- రాజకీయ ప్రవర్తన 21వ శతాబ్దానికి తగదని విమర్శ.



**జనం వాయిస్, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలికి ఇచ్చిన సర్టిఫికెట్‌ను వెంటనే మిగతా 3 లో...

# ఎడిటోరియల్

## మహిళ పై హక్కు ఎవరిది?

**- సంప్రదాయం పేరుతో కొనసాగుతున్న అమానవీయ ఆచారాలకు ముగింపు అవసరం.**

***జనం వాయిస్, ఎడిటోరియల్***

ప్రపంచం సాంకేతికంగా ఎంత ముందుకు వెళ్తున్నా, ఆలోచనల విషయంలో ఇంకా వెనుకబడి ఉన్న సమాజాలు ఉన్నాయి. మహిళల శరీరాలపై, బాలికల భవిష్యత్తుపై జరుగుతున్న కొన్ని ఆచారాలు మానవత్వానికే సవాల్‌గా నిలుస్తున్నాయి. అలాంటి అమానవీయ చర్యల్లో ఒకటి మహిళల జననేంద్రియాలను హానిచేసే ఆచారం. ఇది బహిరంగంగా కనిపించని హింస. కానీ జీవితాంతం వెంటాడే గాయం. సంప్రదాయం, పరంపర అనే పేర్లతో ఈ దారుణాన్ని సమర్థించడమే అసలు ప్రమాదకరమైన విషయం.

ఈ ఆచారం చిన్న వయసులోనే బాలికలపై బలవంతంగా అమలు చేస్తారు. వారికి ఏమి జరుగుతోందో అర్థం కాకముందే, వారి శరీరంపై తిరిగిరాని ముద్ర వేస్తారు. తీవ్రమైన నొప్పి, రక్తస్రావం, ఆరోగ్య సమస్యలు మాత్రమే కాదుడ భయం, అవమానం, మౌనం అనే భావాలు వారి మనసుల్లో గూడు కట్టుకుంటాయి. ఇది ఒక శరీరంపై జరిగే హింస మాత్రమే కాదు. ఒక ఆత్మను కుంగదీసే చర్య. ఆరోగ్యపరమైన సమస్యలతో ఈ దారుణం ఆగిపోదు. పెళ్లి జీవితం, మాతృత్వం, సామాజిక సంబంధాలు ప్రతి దశలోనూ ఈ గాయం ప్రభావం చూపుతుంది. “నా శరీరంపై నాకే హక్కు లేద”న్న భావన ఒక మహిళలో లోతుగా నాటుకుపోతుంది. ఇది వ్యక్తిగత సమస్య కాదు. ఇది మానవ హక్కులపై జరిగిన బహిరంగ దాడి.

అనేక దేశాల్లో ఈ ఆచారంపై చట్టపరమైన నిషేధాలు ఉన్నాయి. శిక్షలూ ఉన్నాయి. అయినప్పటికీ ఇది పూర్తిగా ఆగిపోకపోవడానికి కారణం చట్టాల లోపం కాదు. సామాజిక మౌనం. ఇంటి నాలుగు గోడల మధ్య జరిగే ఈ హింసను “ఇదే మా సంప్రదాయం” అంటూ సమాజం అంగీకరించడమే అసలు సమస్య. పెద్దలు మౌనంగా ఉండటం, తల్లిదండ్రులు భయంతో మాట్లాడకపోవడం వల్లే ఈ దారుణం తరతరాలకు పాకుతోంది.

ఇలాంటి ఆచారాలకు వ్యతిరేకంగా నిజమైన పోరాటం విద్యతోనే మొదలవుతుంది. బాలికలకు మాత్రమే కాదు, తల్లిదండ్రులకు, కుటుంబ పెద్దలకు, మత పెద్దలకు కూడా అవగాహన కల్పించాలి. సంప్రదాయం అంటే మారనిది కాదని, మానవత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఆచారాలను వదిలేయడం కూడా అభివృద్ధేనని సమాజానికి అర్థమయ్యేలా చెప్పాలి. ఒక బాలిక “నాకు ఇది వద్దు” అని చెప్పగలిగే ధైర్యం కలగాలి. ఆమె మాటకు కుటుంబం, సమాజం అండగా నిలవాలి.

ప్రతి ఏడాది ఫిబ్రవరి 6న ఈ అమానవీయ ఆచారాలపై శూన్య సహనం పాటించాలన్న సందేశం ప్రపంచానికి వినిపిస్తుంది. కానీ ఇది ఒక్కరోజు మాటగా మిగిలిపోతే ప్రయోజనం లేదు. ప్రతి కుటుంబం తనలో తాను ప్రశ్నించుకోవాలి. సంప్రదాయం పేరుతో మనం చేస్తున్నది తప్పా? నేరమా? ఒక బాలిక భవిష్యత్తును నాశనం చేస్తున్నామా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పినప్పుడే మార్పు మొదలవుతుంది.

సంస్కృతి అంటే కాలంతో పాటు మారేది. మానవత్వానికి విరుద్ధంగా ఉన్న ఏ ఆచారమైనా ప్రశ్నించాల్సిందే. మహిళ శరీరంపై మహిళకే సంపూర్ణ హక్కు ఉందన్న సత్యాన్ని అంగీకరించిన రోజే ఇలాంటి దారుణాలకు నిజమైన ముగింపు వస్తుంది. మౌనాన్ని విరిచినప్పుడే, భయాన్ని జయించినప్పుడే, సమాజం నిజమైన అర్థంలో ముందుకు సాగుతుంది. చట్టాల పరంగా చూస్తే, అనేక దేశాల్లో ఈ ఆచారం నిషేధితమే. శిక్షలూ ఉన్నాయి. అయినా ఇది పూర్తిగా ఆగకపోవడానికి కారణం చట్టాల బలహీనత కాదు. ఆలోచనల బలహీనత. భయంతో, అవమానంతో, సమాజానికి ఎదురు చెప్పలేని పరిస్థితిలో తల్లిదండ్రులే తమ పిల్లలపై ఈ హింసకు సహకరించాల్సి వస్తోంది. ఇది చట్టంతో మాత్రమే పరిష్కరించగల సమస్య కాదు. ఇది మనసుల్లో మార్పు తీసుకురావాల్సిన సమస్య.

ఇక్కడే విద్య ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తుంది. బాలికలకు మాత్రమే కాదు, బాలికల తల్లిదండ్రులకు, కుటుంబ పెద్దలకు, గ్రామ పెద్దలకు అవగాహన కల్పించాలి. మహిళ శరీరం ఎవరి ఆస్తి కాదని, అది ఆమెకు మాత్రమే చెందినదని చిన్నప్పటి నుంచే చెప్పాలి. ఒక బాలిక తనకు నచ్చని దానిని తిరస్కరించే ధైర్యం పొందాలి. ఆమె మాటకు కుటుంబం అండగా నిలబడే సంస్కృతి ఏర్పడాలి.

ప్రతి ఏడాది ఫిబ్రవరి 6న ఈ అమానవీయ ఆచారాలపై శూన్య సహనం పాటించాలన్న సందేశం ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తుంది. కానీ అది కేవలం పోస్టర్లకే పరిమితం అయితే ప్రయోజనం ఉండదు. ప్రతి ఇంట్లో, ప్రతి ఊరిలో, ప్రతి సమాజంలో చర్చకు రావాలి. “సంప్రదాయం అంటే మనుషుల ప్రాణాలకంటే గొప్పదా?” అనే ప్రశ్నను ప్రతి ఒక్కరూ తమను తాము అడగాలి.

సంస్కృతి అంటే కాలంతో పాటు మారేది. ఒకప్పుడు సహజంగా భావించిన ఎన్నో ఆచారాలు నేడు నేరాలుగా గుర్తించబడుతున్నాయి. అలాగే మహిళ శరీరంపై జరుగుతున్న ఈ దారుణాన్ని కూడా సమాజం ఖండించే స్థాయికి ఎదగాలి. మానవత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఏ సంప్రదాయమైనా వదిలేయడమే నిజమైన అభివృద్ధి. అదే నిజమైన సంస్కృతి.

మహిళ శరీరంపై మహిళకే సంపూర్ణ హక్కు ఉందన్న సత్యాన్ని సమాజం అంగీకరించిన రోజే ఇలాంటి అమానవీయ ఆచారాలకు అంతం మొదలవుతుంది. మౌనాన్ని విరిచినప్పుడే మార్పు వస్తుంది. భయాన్ని జయించినప్పుడే భవిష్యత్ తరాలకు సురక్షితమైన సమాజం ఏర్పడుతుంది. ఈ పోరాటం ఒకరోజు కాదు. ప్రతి రోజూ కొనసాగాల్సిన మానవత్వ యుద్ధం.

# వరంగల్ కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేస్తాం



**మొదటిపేజీ తరువాయి...** బహిరంగ సభలో మాట్లాడుతూ, వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు విమానాశ్రయాన్ని పూర్తి చేసి, కరీంనగర్ ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసి జంట నగరాలుగా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి ఆదిలాబాద్ బాసర నుంచి ఖమ్మం భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాలను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. అవసరమైతే నాలుగు నుంచి ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి దేవాలయాలను పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మధ్యలో అటవీ ప్రాంతాల్లో ఎకోటూరిజాన్ని కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండగగా మార్చాలన్న సంకల్పంతో రుణమాఫీ, గిట్టుబాటు ధర, సన్నవడ్లకు బోనస్, రైతు బీమా, రైతుభరోసా వంటి పథకాలతో వ్యవసాయ రంగానికి రూ. 1.15 లక్షల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. గడిచిన రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ. 27 వేల కోట్లు, వెయ్యి బస్సులు, పెట్రోల్ బంకులు, వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాల కేటాయింపులు చేశామని వివరించారు. ఈ సభలో జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కరీంనగర్ శ్రీ సీతారామచంద్ర జిల్లా మహిళా సమాఖ్యకు రూ. 110.10 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందించారు.

# లోక్ సభలో అరుదైన పరిణామం

**జనం వాయిస్, న్యూఢిల్లీ:** గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం లోక్‌సభలో ప్రధానమంత్రి ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభ ఆమోదించింది. సాధారణంగా ఈ తీర్మానంపై ప్రధానమంత్రి మాట్లాడటం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ ప్రక్రియ జరగకపోవడం రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. ప్రధాని నరేంద్ర మోదీపై దాడి చేసేందుకు ప్రణాళిక రూపొందిందన్న సమాచారంతోనే సభను వాయిదా వేసినట్లు లోక్‌సభ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. లోక్‌సభలో ప్రధాని ప్రసంగించే సమయంలో ఆయనను చుట్టుముట్టి దాడి చేసేందుకు ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ప్లాన్ చేసినట్లు భద్రతా సంస్థలకు సమాచారం అందినట్లు పేర్కొన్నాయి. ఈ సమాచారం నేపథ్యంలో భద్రతాపరమైన ప్రమాదాలను నివారించేందుకు బుధవారం సభను వాయిదా వేయాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. ప్రధాని ప్రసంగించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభా కార్యకలాపాలను నిలిపివేసినట్లు లోక్‌సభ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదం పొందడం పార్లమెంటరీ చరిత్రలో అరుదైన ఘటనగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భద్రతా హెచ్చరికల నేపథ్యంలో తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# సస్పెన్షన్‌కు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన

- **వాణిజ్య ఒప్పందంపై చర్చకు అడ్డంకులు.**
- **సైన్యాధిపతి నరవణే పుస్తక అంశాల ప్రస్తావనకు నిరోధం.**
- **సస్పెండ్ అయిన ఎంపీలతో కలిసి నిరసన.**
- **రాహుల్ గాంధీ సంఘీభావం.**




**జనం వాయిస్, న్యూఢిల్లీ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో ప్రధాని నరేంద్ర మోదీ రాజీపడి దేశ ప్రయోజనాలను తాకట్టుపెట్టారన్న అంశాన్ని, అలాగే మాజీ సైన్యాధిపతి నరవణే పుస్తకంలో పేర్కొన్న కీలక విషయాలను సభలో ప్రస్తావించకుండా అధికార పార్టీ బీజేపీ సభ్యులు అడ్డుకున్నారని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. ఈ పరిణామాలకు నిరసనగా సస్పెండ్ అయిన సభ్యులు పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో తనతో పాటు సస్పెన్షన్‌కు గురైన ఇతర ఎంపీలు పాల్గొన్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చ జరగకుండా అడ్డుకోవడం సరికాదని వారు స్పష్టం చేశారు. దేశానికి సంబంధించిన కీలక అంశాలపై మాట్లాడే హక్కును అధికార పార్టీ హరించుతోందని విమర్శించారు. వాణిజ్య ఒప్పందం వల్ల దేశ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందన్న ఆందోళనను వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఈ నిరసనకు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా హాజరై సంఘీభావం తెలిపారు. సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కల్పించకుండా ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో చర్చ, భిన్నాభిప్రాయాలకు గౌరవం ఉండాల్సిందేనని అన్నారు. ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా, అలాగే దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరగాలన్న డిమాండ్‌తో ఈ నిరసన కొనసాగినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, సభలోనూ బయటా తమ స్వరం వినిపిస్తామని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

# పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం

**మొదటిపేజీ తరువాయి...** ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో బలంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, 7, 8 తేదీల్లో జనసేన పార్టీ అభ్యర్థులకు, అలాగే బీజేపీ పార్టీకి మద్దతుగా తాను స్వయంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని వెల్లడించారు. ప్రజల సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రచారం నిర్వహించాలని, అభివృద్ధి, పారదర్శక పాలన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తన రాజకీయ బాధ్యతను స్పష్టంగా నిర్వర్తిస్తుందని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో, ఐక్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, ఆర్‌కే సాగర్‌తో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభావవంతమైన పాత్ర పోషిస్తుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు.

దినపత్రిక జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# రైతు బంధుపై కాంగ్రెస్ మోసం

**మొదటిపేజీ తరువాయి...** ఎన్ని పంటకాలాలు గడిచాయో, రైతులకు ఎన్నిసార్లు రైతుబంధు వేశారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు రైతుబంధు రైతుల ఖాతాల్లో వేయడానికి ఏ విధంగా అడ్డొస్తున్నాయో ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆశలు చూపించి, ఎన్నికలు పూర్తయ్యాక మళ్లీ ప్రజలను మోసం చేయడానికే కాంగ్రెస్ ఈ మాటలు చెబుతోందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పక్కన పెట్టారని, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి అధికారమూ, అవకాశం ఉన్నప్పుడు గత ముఖ్యమంత్రి కేసీఆర్ను తిట్టాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. చేతనైతే ప్రజలకు మంచి చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కానీ ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా చేయలేదని, కేవలం అబద్ధాలు మాట్లాడటమే తప్ప ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను ఎత్తివేయాలని కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన పార్టీకి ఓటు వేయాలా? వద్దా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని సూచించారు. ఈ మున్సిపల్ ఎన్నికల పోటీ గత పదేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి, రెండేళ్లలోనే ఉన్న పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరుగుతోందని చెప్పారు. మరోసారి కేసీఆర్ను ముఖ్యమంత్రిని చేస్తేనే అభివృద్ధి,



సంక్షేమ పథకాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికల నుంచే ఉద్యమం మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## ప్రజలను భయపెడుతున్న పెద్దపులి

**జనం వాయిస్, యాదాద్రి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. గత నెల రోజులుగా జిల్లాలోని పలు గ్రామాల చుట్టూ తిరుగుతున్న ఈ పులి కారణంగా ప్రజలు పొలాలకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళ గ్రామ శివార్లలో పులి సంచారం ఎక్కువగా కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా జగదేవ్పూర్ మండలంలో కూడా పెద్దపులి సంచారం జరిగినట్లు ఆనవాళ్లు లభ్యమయ్యాయి. పులి పాదముద్రలు, దాడుల గుర్తించడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాల సరిహద్దులు దాటి పులి సంచరిస్తుండటంతో పరిసర గ్రామాల్లో ఆందోళన మరింత పెరిగింది. గడిచిన 20 రోజుల వ్యవధిలో సుమారు 9 లేగ దూడలను పెద్దపులి చంపి తిన్నట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పశువులపై వరుస దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పశువులను రాత్రివేళ కాపాడుకునేందుకు రైతులు గ్రామాల్లో కాపలా కాస్తున్నారు. నెల రోజులుగా పెద్దపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పులి చిక్కడం లేదు. ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోవడంతో అధికారులకు ఈ పులి చుక్కలు చూపిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అడవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని అటవీ శాఖ సూచనలు జారీ చేసింది.

## ఎంపీ అరవింద్ వ్యాఖ్యలకు టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్

**జనం వాయిస్, నిజామాబాద్:** ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలకు టీపీసీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నిజామాబాద్ మేయర్ అభ్యర్థిని ఇప్పటివరకు ప్రకటించలేదని, ఆ అంశాన్ని పట్టుకుని విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల విషయంలో కాంగ్రెస్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోందని తెలిపారు. అమృత్ సిటీగా గుర్తింపు పొందిన నిజామాబాద్ను ఎంపీ అరవింద్ అభివృద్ధి చేయలేదని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర నిధులు, పథకాలను సద్వినియోగం చేసుకునే విషయంలో ఎంపీ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నగర అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు ఎంపీకి లేదని పేర్కొన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టినప్పుడు ఎంపీ అరవింద్ ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. బీసీల హక్కుల కోసం పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి, రాజకీయ లాభనష్టాల కోసమే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీసీ వర్గాల సమస్యలపై ఎంపీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎంపీ అరవింద్కు ఎన్నికలు వచ్చినప్పుడే మతం గుర్తుకు వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిసారి ఏదో ఒక అంశాన్ని తీసుకుని దానిపైనే రాజకీయాలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. ప్రజలు ఇప్పుడు ఈ రాజకీయాలను గమనిస్తున్నారని, నిజామాబాద్ ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఆయన స్పష్టం చేశారు.

## పేద, బడుగు వర్గాల హక్కుల కోసం పోరాటం

**జనం వాయిస్, వనపర్తి:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి మున్సిపాలిటీ 13వ వార్డు టీఆర్పీ అభ్యర్థి బాలరాజు సాగర్ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ, ఇప్పటివరకు అధికార పార్టీల పాలనలో వనపర్తి పట్టణం తగిన అభివృద్ధికి నోచుకోలేదని తీన్మార్ మల్లన్న విమర్శించారు. ప్రజల ప్రాథమిక సమస్యలను పట్టించుకోని పాలకులకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. పట్టణంలో మౌలిక వసతుల కొరత, ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. టీఆర్పీ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాలిటీల్లో పారదర్శక పాలన తీసుకొస్తామని మల్లన్న హామీ ఇచ్చారు. ప్రజలు కట్టే పన్నును ప్రజల అభివృద్ధికే ఖర్చు చేస్తామని, వార్డు స్థాయి నుంచే సమస్యల పరిష్కారానికి టీఆర్పీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం రాజీ లేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 13వ వార్డు టీఆర్పీ అభ్యర్థి బాలరాజు సాగర్ను భారీ మెజార్టీతో గెలిపించాలని, టీఆర్పీ పార్టీకి ఒక అవకాశం ఇచ్చి నిజమైన ప్రజాపాలనకు దారి తీయాలని తీన్మార్ మల్లన్న ప్రజలను కోరారు. ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## హుజూరాబాద్ అభివృద్ధే బీజేపీ లక్ష్యం

**జనం వాయిస్, హుజూరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా హుజూరాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీకి రూపాయి కూడా ఇవ్వని బీఆర్ఎస్కు, గాడిద గుడ్డు ఇచ్చిన కాంగ్రెస్కు ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా కేంద్రం నుంచి నిధులు తెచ్చి హుజూరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డామని బండి సంజయ్ తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా రూ.19 కోట్లు 57 లక్షలు, స్వచ్ఛ భారత్ కింద రూ.1.10 కోట్లు, అమృత్ పథకం కింద రూ.16.25 కోట్లు, స్వనిధి పథకం కింద రూ.7.63 కోట్లు, పట్టణ మౌలిక సదుపాయాల కింద రూ.36 కోట్లు హుజూరాబాద్కు మంజూరు చేయించినట్లు చెప్పారు. వీధి దీపాలు, డ్రైనేజీలు, రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధికి కూడా కేంద్ర నిధులే ఉపయోగపడ్డాయని తెలిపారు. ఇవి కాకుండా సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తెచ్చి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు అందించామని చెప్పారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, బోర్లు వేయించడం, పదవ తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజుల చెల్లింపు వంటి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అందుకే హుజూరాబాద్ ప్రజలను ఓట్లు అడుగుతున్నానని, బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో కారణాలు చెబుతున్నానని అన్నారు. బీజేపీకి హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠం అప్పగిస్తే, అర్ధాంతరంగా నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్ పనులను పూర్తి చేయిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. అవసరమైన చోట మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. హుజూరాబాద్లో మినీ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా చూస్తానని తెలిపారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం ప్రజలు ఆలోచించి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు.

## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

**జనం వాయిస్, హనుమకొండ:** ఆసియా అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతర హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు దాదాపు పది రోజుల సమయం పట్టనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు వైభవంగా జరిగింది. జాతర సమయంలోనే కాకుండా ముందు, తరువాత కూడా కోట్లాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తరలించారు. ఈ రోజు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి అధికారికంగా హుండీల లెక్కింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. జాతరకు తరలివచ్చిన భక్తులు అమ్మవార్లకు నగదు,



బంగారం, వెండి, ఇతర కానుకలను హుండీల్లో సమర్పించారు. గతసారి మేడారం మహా జాతరకు హుండీల ద్వారా సుమారు రూ.13 కోట్ల ఆదాయం సమకూరిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భక్తుల విశ్వాసంతో సమకూరే కానుకల లెక్కింపును పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని, లెక్కింపు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

## సీఎం రేవంత్రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్ను వెనక్కి తీసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి...** వెనక్కి తీసుకోవాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తాను హార్వర్డ్ యూనివర్సిటీకి ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తి పంపినట్లు ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేనన్ని క్రిమినల్ కేసులు ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో ఏసీబీకి రెడ్హ్యాండెడ్గా దొరికిన వ్యక్తికి ఇలాంటి సర్టిఫికెట్ ఇవ్వడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దాదాపు 50 రోజులు జైలులో గడిపిన నేపథ్యం ఉన్న నాయకుడికి అకడమిక్ స్థాయి గుర్తింపు ఇవ్వడం అనుచితమని ఆరోపించారు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పలు కుంభకోణాలకు పాల్పడుతున్నారని, తెలంగాణ ప్రజలపై ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని ప్రవీణ్కుమార్ విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులపై ప్రతి వేదికలో అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్నారని, ఇలాంటి నాయకత్వం 21వ శతాబ్దానికి తగదని వ్యాఖ్యానించారు. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర రాజకీయాల్లో చర్చ మొదలైంది. హార్వర్డ్ యూనివర్సిటీ ఈ విజ్ఞప్తిపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ఈషా సింగ్కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**జనం వాయిస్, హైదరాబాద్:** షూటింగ్లో స్వర్ణ పతకం సాధించి దేశానికి, తెలంగాణకు అపార గర్వం తీసుకొచ్చిన తెలంగాణ కూతురు ఈషా సింగ్కు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈషా సాధించిన విజయం దేశానికి గర్వకారణమని, ఆమె జన్మించిన నేలకే కీర్తి ప్రతిష్టలు తెచ్చిందని సీఎం పేర్కొన్నారు. ఈషా సింగ్ ప్రదర్శించిన ధైర్యం, ఏకాగ్రత, పోరాట స్ఫూర్తి తెలంగాణ యువత బలానికి ప్రతిబింబమని సీఎం అన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతి నిరంతరం ఎదుగుతోందనడానికి ఈ విజయం నిదర్శనమని వ్యాఖ్యానించారు. యువతలో, ముఖ్యంగా బాలికల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా ఈ స్వర్ణ విజయం నిలుస్తుందని తెలిపారు. ఈ ఘన విజయం అనేక మంది యువతులను పెద్ద కలలు కనేందుకు, మరింత ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ప్రేరేపిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారని అన్నారు. "ఈషా సింగ్పై తెలంగాణకు గర్వం. ఆమె భవిష్యత్ ప్రయాణంలో రాష్ట్రం సంపూర్ణంగా అండగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# సమ్మక్క సారలమ్మ దర్శనంపై సీఎం వ్యాఖ్యలు అబద్ధాలు

- కేసీఆర్ దర్శనానికి ఆధారాలు ఉన్నాయని స్పష్టం
- సీతక్కే ప్రత్యక్ష సాక్షి అని పేర్కొన్న నేతలు.
- ముఖ్యమంత్రి హోదాలో బాధ్యతా యుతంగా మాట్లాడాలన్న హితవు.
- అబద్ధాల ప్రచారంపై ప్రజల్లో ఆగ్రహం.



**జనం వాయిస్, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇంత దిగజారి మరీ అబద్ధాలు మాట్లాడటం సరికాదని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సమ్మక్కసారలమ్మలను దర్శించుకోలేదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని నేతలు, ప్రజలు ఖండిస్తున్నారు.వాస్తవానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సమేతంగా సమ్మక్కసారలమ్మలను దర్శించుకుని, తులాభారంలో వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారని వారు గుర్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి స్పష్టమైన ఆధారాలు, ఫొటోలు, ప్రత్యక్ష సాక్షులు ఉన్నాయని తెలిపారు. ఈ దర్శన సమయంలో ప్రస్తుత మంత్రి సీతక్క స్వయంగా కేసీఆర్ వెంట ఉన్నారని, ఆమెనే దీనికి ప్రధాన సాక్షి అని విమర్శకులు పేర్కొన్నారు. ఈ విషయం నిజం కాదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ స్థాయిలో స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, ప్రజాముఖంగా అబద్ధాలు ప్రచారం చేయడం దురదృష్టకరమని అభిప్రాయపడుతున్నారు. అబద్ధాల పునాదులపై అధికారం చేపట్టి, నేటికీ అవే అబద్ధాలతో కాలం గడుపుతున్నారా? అని ప్రశ్నిస్తూ, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాటలకు బాధ్యత ఉండాలని ప్రజలు కోరుతున్నారు. నిజాలను వక్రీకరించి, అనుకూల పత్రికలు, ఛానళ్ల ద్వారా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో కమలం గుర్తుకే ఓటేయాలి




- ముషీరాబాద్‌లో 'పట్టణ తెలంగాణ పతనం'పై ప్రజెంటేషన్.
- బీఆర్ఎస్ కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు.
- అవినీతి, పరిపాలనా వైఫల్యాలపై ఆరోపణలు.
- పారదర్శక పాలన కోసం బీజేపీకి మద్దతు కోరిన నేత.

**జనం వాయిస్, హైదరాబాద్:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్‌లో నిర్వహించిన "పట్టణ తెలంగాణ పతనం 12 ఏళ్లు" ప్రజెంటేషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్ రాం చందర్ రావు పాల్గొని ప్రసంగించారు. గత 12 ఏళ్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్పులు, అవినీతి, పరిపాలనా వైఫల్యాలు, హామీల మోసం, శాంతిభద్రతల పతనం, మహిళల రక్షణలో వైఫల్యం, ఫిరాయింపు రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యానికి భారీ నష్టం జరిగిందని ఆధారాలతో సహా ప్రజలకు వివరించామని తెలిపారు. పట్టణ తెలంగాణ అభివృద్ధి పూర్తిగా వెనుకబడిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ, నగరాల భవిష్యత్తు కోసం, పారదర్శక పాలన కోసం ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ఎన్ రాం చందర్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణను కాపాడుకోవాలంటే కమలం గుర్తుకే ఓటేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మహారాష్ట్ర మంత్రి, ఎన్నికల ఇన్‌ఛార్జ్ ఆశిష్ షెలార్తో పాటు ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయమే పట్టణ తెలంగాణకు దిశానిర్దేశం చేస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణపై దృష్టి

- సూక్ష్మ పరిశీలకులు, జోనల్ అధికారులకు శిక్షణ.
- ఎన్నికల నిబంధనలపై కట్టుదిట్టమైన అమలు.
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణపై దృష్టి.




**జనం వాయిస్, ఆదిలాబాద్:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, జోనల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను వెంటనే గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాలని సూక్ష్మ పరిశీలకులకు సూచించారు. జోనల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సాధారణ ఎన్నికల పరిశీలకులు హనుమంత్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ ఎన్నికల విధివిధానాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ జి. రాజు, నోడల్ అధికారి మనోహర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఎన్నికల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు.



# ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి

- *జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.*
- *నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్ష.*
- *ఇసుక కొరత లేకుండా చర్యలు.*
- *పెండింగ్ దరఖాస్తుల తక్షణ పరిష్కారం.*
- *గణాంక సర్వే త్వరగా పూర్తి చేయాలన్న ఆదేశం.*




**జనం వాయిస్, నిర్మల్:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మండలాల వారీగా ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణాలకు ఇసుక కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిపారుదల గణాంక సర్వేను త్వరగా పూర్తి చేయాలని, ఈ విషయంలో తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూభారతి, కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్, ప్రజావాణి తదితర విభాగాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫైలుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల స్థాయిలో సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు

**జనం వాయిస్, హుస్నాబాద్:**



హుస్నాబాద్ మున్సిపాలిటీ 5వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొలిశెట్టి రాజుకు మద్దతుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీతో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ పట్టణాన్ని ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి 20 స్థానాలు గెలిపిస్తే, తనకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టేందుకు మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే తమ ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ప్రెస్‌మీట్

**జనం వాయిస్, మహబూబాబాద్:**

మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రెస్‌మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను ఎజెండాగా చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ప్రెస్‌మీట్‌లో భారాస జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ కవిత మాలోత్, మాజీ శాసనసభ్యుడు బానోతు శంకర్ నాయక్, బీఆర్ఎస్ నేతలు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, నాయిని రంజిత్, మరినేని వెంకన్న, కేఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే బీఆర్ఎస్ లక్ష్యమని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నేతలు స్పష్టం చేశారు.



# పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి.

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**- సమక్క సారలమ్మ జాతర, గోదావరి పుష్కరాల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్.**

**జనం వాయిస్, పెద్దపల్లి:**



పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అంతర్గాం మండలంలోని గోలివాడ, రామగుండం, గోదావరిఖని సమ్మక్క సారలమ్మ టెంపుల్, రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ , మంథని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ , గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట, ఘాట్ నిర్మాణం పనులు ఉన్నాయని,స్థలం ఏర్పాటు మొదలగు పనులు రోజుకు లక్ష భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారెజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని , ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ & ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ లు బి.గంగయ్య, సురేష్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఇ.వై.టీం. తః రీ ఖాన్, జై దీప్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నమ్మి మోసపోతే మళ్లి గోసపడక తప్పదు



**- మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగురురాలే.**
**- మా అభ్యర్థులను ఆశీర్వదించి ఆదరించాలే.**
**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.**

**జనం వాయిస్, మంథని:**

గత ప్రభుత్వహాయాంలో మంథని అభివృద్ధిని చూసి మరింత అభివృద్ధి కోసం భీఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు లో ఎరూకల గూడెం, ముత్యాలమ్మ వాడ మరియు 3వ అంబేద్కర్ నగర్ లో ఆయన అభ్యర్థులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు.పదేళ్ల క్రితం మంథని పట్టణం ఎంత వెనుకబాటులో ఉండేదో, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా పట్టణ అభివృద్ధికి చేసిన కృషిని గమనించాలని అన్నారు. పట్టణ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశామని, అలాగే మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, మున్సిపల్ చైర్ పర్సన్‌గా పుట్ట శైలజ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు, అబద్దాలను నమ్మి ఓట్లు వేస్తే రెండేళ్లుగా గోసపడుతున్నామని, మళ్లీ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే కన్నీళ్లు తప్ప ఏమీ ఉండదన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమం, సమస్యల పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి ఆశీర్వదించాలని, పేద బడుగు బలహీనవర్గాల కోసం తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టణ ప్రజలకు జరిగిన మేలు ఏంటో ఆలోచించి ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మహా ముత్తారం మండల విద్యార్థి



**జనం వాయిస్,మహాముత్తారం:**

మహా ముత్తారం మండలం జడ్.పి.హెచ్.ఎస్ (ఉన్నత) పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వై. సంతోష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై పాఠశాలకే కాకుండా మండలానికి గర్వకారణంగా నిలిచాడు. హనుమకొండలో ఈ నెల 2న నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్‌లో వై. సంతోష్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సంతోష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి అభినందించి, రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 5 నుంచి 8 వరకు నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సంతోష్ పాల్గొననున్నట్లు పిడి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి వై. సంతోష్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం హృదయపూర్వకంగా అభినందించింది.

# ఎల్లమ్మ గుడికి 50 వేల రూపాయలు విరాళం.

**జనం వాయిస్, ముత్తారం:**

ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులు నిర్మిస్తున్న ఎల్లమ్మ గుడికి నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ (సింగరేణి ఉద్యోగి) రూ.50 వేల విరాళాన్ని గురువారం గౌడ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ఆరాధ్య దైవం ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ గుడి నిర్మాణం లో తన వంతుగా సహాయం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ కమీటి సభ్యులు, గౌడ కులస్తులు శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చేవెళ్ల న్యాయవాది స్వప్న ఆత్మకు శాంతి కలగాలి.

## -యువ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పొన్నం రవీందర్ యాదవ్.

**- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్.**
**-రంగారెడ్డి కోర్టులో క్యాండిల్ ర్యాలీ.**




**జనం వాయిస్, హైదరాబాద్:**

మొయినాబాద్ గ్రామానికి చెందిన, చేవెళ్ల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్న పై జరిగిన అమానుష దాడి మరియు అత్యంత కిరాతకంగా గొంతు కోసి హత్య చేయడం ఘటన పై యువ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పొన్నం రవీందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. గురువారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తూ అనంతరం మాట్లాడుతూ యావత్ న్యాయవాద వృత్తిని, సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. న్యాయవ్యవస్థలో కీలకమైన పాత్ర పోషించే ఒక న్యాయవాదిపై ఈ విధమైన దారుణ హత్య జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ, న్యాయవాదులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టు ముందు, స్వప్న న్యాయవాది ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కేసు విషయమై జాతీయ మానవ హక్కుల కమిషన్ లో కేసు ఫైల్ చేయడం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి, నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, రోజూ ప్రజల న్యాయహక్కుల కోసం పోరాడుతున్న న్యాయవాదుల భద్రతను కల్పించేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలనేది మా ప్రధాన డిమాండ్ అన్నారు. న్యాయవాదులు విధి నిర్వహణలో బెదిరింపులు, దాడులు, ఒత్తిడులకు గురవుతున్న పరిస్థితులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే, న్యాయవాదులకు ప్రత్యేక చట్టపరమైన రక్షణ అవసరమన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ద్వారా న్యాయవాదులపై దాడులను తీవ్రమైన నేరాలుగా పరిగణించడం, వేగవంతమైన విచారణ, కఠినమైన శిక్షలు, విధి నిర్వహణలో భద్రత కల్పించడం వంటి నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వప్న న్యాయవాది హత్యను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు, న్యాయవ్యవస్థపై జరిగిన దాడి. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యంత గంభీరంగా తీసుకొని, న్యాయవాదుల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని మేము డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే నరసింహ, మహిళా న్యాయవాది, రూప తాటికొండ న్యాయవాది,భాగ్య మరియు దామరుప్పుల కుమారస్వామి, క్రాంతి రెడ్డి, కొంగల మోహన్ గౌడ్ హైకోర్టు న్యాయవాది, నగేష్,వీరన్న, విజయ్ కుమార్, గంగ బోయిన రాంబాబు, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రపంచ అందగత్తెల జాబితాలో కృతి.



**జనం వాయిస్, సినిమా:**

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే అత్యంత అందగత్తెల జాబితాను ప్రముఖ మూవీ డేటాబేస్ తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం అంటే కేవలం అందం మాత్రమే కాదు, గ్లోబల్ స్థాయిలో ఉన్న ప్రజాదరణ, క్రేజ్, సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్‌కు కూడా ఇది ప్రతిబింబంగా భావిస్తారు. తాజాగా వెలువడిన టాప్10 జాబితాలో భారతీయ నటి కృతి సనన్ ఐదో స్థానంలో నిలవడం విశేషంగా మారింది. ఈ జాబితాలో తొలి స్థానంలో హాలీవుడ్ నటి మార్గోట్ రోబీ నిలవగా, ఆమె తర్వాత షైలీన్ వుడ్లీ, డిల్రాబా దిల్‌మురాత్ వంటి అంతర్జాతీయ నటీమణులు వరుసగా చోటు సంపాదించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణకు, అభిమానుల ప్రేమకు నిదర్శనంగా కృతి సనన్ ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం భారత సినీ అభిమానులకు గర్వకారణంగా మారింది. కృతి సనన్‌తో పాటు నాన్సీ మెక్‌డోనీ, హానియా అమీర్, అనా డి అర్మాస్, ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్, హండే ఎర్చెల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ సుందరీమణులు కూడా ఈ టాప్10లో చోటు దక్కించుకున్నారు. ఇటీవల వరుస సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కృతి, అందంతో పాటు నటనలోనూ తనదైన ముద్ర వేస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మరోసారి లాయర్ అవతారంలో తాప్సీ

**జనం వాయిస్, సినిమా:**

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను మరోసారి తన శక్తివంతమైన నటనతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రముఖ దర్శకుడు అనుభవ్ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'అస్సీ'లో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో విడుదల కానుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌ను చూస్తే తాప్సీ మరోసారి లాయర్ పాత్రలో కనిపించబోతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గతంలో 'ముల్క్' చిత్రంలో ఆమె చేసిన న్యాయవాది పాత్రకు మంచి ప్రశంసలు వచ్చిన సంగతి తెలిసిందే. 'అస్సీ'లోనూ మహిళలపై జరుగుతున్న నేరాలపై పోరాడే ధైర్యవంతమైన న్యాయవాదిగా ఆమె నటిస్తోంది. దేశంలో ప్రతిరోజూ సుమారు 80 మంది మహిళలు లైంగిక దాడులకు గురవుతున్నారనే అంశాన్ని కథాంశంగా తీసుకుని ఈ కోర్ట్‌రూమ్ డ్రామాను తెరకెక్కించారు. బాధిత మహిళలకు న్యాయం అందించేందుకు న్యాయవ్యవస్థలో జరిగే పోరాటాన్ని ఈ సినిమా బలంగా చూపించబోతోందని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. అనుభవ్ సిన్హా తాప్సీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'ముల్క్', 'థప్పడ్' చిత్రాలు సామాజిక అంశాలతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ కాంబోలో ఇది మూడో సినిమా కావడంతో 'అస్సీ'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా, రేవతి, కని కుస్రుతి, మనోజ్ పహ్వా వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సామాజిక చైతన్యాన్ని కలిగించే కథ, కోర్ట్‌రూమ్ డ్రామా ఎలిమెంట్స్, తాప్సీ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ కలయికతో 'అస్సీ' మరోసారి ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## రెబల్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్. ఎక్స్‌టెండెడ్ కట్‌తో ఓటీటీలోకి 'ది రాజాసాబ్'!

**జనం వాయిస్, సినిమా:**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో తెరకెక్కిన క్రేజీ హారర్-కామెడీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. థియేటర్లలో మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్ ఈ చిత్ర డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 06 నుంచి తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమాకు సంబంధించి రెబల్ ఫ్యాన్స్‌కి అసలు గుడ్ న్యూస్ ఏంటంటే.. ఓటీటీ వెర్షన్‌లో 'ది రాజాసాబ్' ఎక్స్‌టెండెడ్ కట్‌తో అందుబాటులోకి రానుంది. థియేటర్ వెర్షన్‌లో తొలగించిన కొన్ని సీన్స్, అదనపు ఫుటేజ్‌ను ఓటీటీ వెర్షన్‌లో జోడించినట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. దీంతో థియేటర్‌లో మిస్ అయిన కంటెంట్‌ను ఇంట్లోనే కూర్చుని చూసే అవకాశం అభిమానులకు దక్కింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపించిన ఈ చిత్రంలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కీలక పాత్రల్లో నటించారు. హారర్, కామెడీ మిక్స్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలను కూడా ఈ సినిమాలో హైలైట్ చేశారు. కథ విషయానికి వస్తే.. రాజు అలియాస్ రాజాసాబ్‌కు అమ్మానాన్నల స్థానంలో నాయనమ్మ గంగాదేవే అన్నీ. ఆల్జీమర్స్‌తో బాధపడుతున్న గంగాదేవి చాలా విషయాలు మర్చిపోతున్నా.. తన భర్త కనకరాజును మాత్రం మర్చిపోదు. నాయనమ్మ కోరికను నెరవేర్చాలనే తపనతో రాజు తన తాత గురించి వెతుకుతాడు. ఈ క్రమంలో నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్‌కు సంబంధించిన సంచలన నిజాలు బయటపడతాయి. ఆ రాజమహల్‌లో అడుగుపెట్టిన తర్వాత రాజుకు ఎదురైన అనుభవాలు, కనకరాజు గతం, గంగాదేవిని ఎందుకు వదిలి వెళ్లాడనే రహస్యాలే ఈ కథలో ప్రధానంగా నడుస్తాయి. మొత్తానికి థియేటర్‌లో చూసిన వారికి కూడా ఎక్స్‌టెండెడ్ కట్‌తో మరో కొత్త అనుభూతి దక్కనుంది. రెబల్ ఫ్యాన్స్‌కు ఇది నిజంగా పండుగలాంటిదే.



# కుర్రాళ్లకు మెంటలెక్కించిన హీరోయిన్..



**జనం వాయిస్, సినిమా:**

దక్షిణాది చిత్రపరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా వెలుగొందిన అనుష్క శెట్టి.. తెలుగు, తమిళ చిత్రాల్లో వరుస బ్లాక్‌బస్టర్ హిట్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. గ్లామర్ పాత్రలతోనే కాదు, లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో కూడా బాక్సాఫీస్ క్వీన్‌గా పేరు తెచ్చుకుంది. దశాబ్దానికి పైగా తన స్టార్‌డమ్ కొనసాగిస్తూ ప్రభాస్, నాగార్జున, రవితేజ వంటి స్టార్ హీరోల సరసన నటించి భారీ విజయాలు అందుకుంది. 2005లో నాగార్జున నటించిన 'సూపర్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అనుష్క శెట్టి.. మొదట్లో గ్లామరస్ పాత్రల్లో కనిపించినా 'అరుంధతి' సినిమాతో పూర్తిగా తన ఇమేజ్‌ను మార్చుకుంది. ఈ చిత్రం ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచి, లేడీ ఓరియెంటెడ్ కథలకూ ఆమె సరైన ఎంపిక అని నిరూపించింది. 'బిల్లా', 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి చిత్రాల్లో విభిన్నమైన పాత్రలతో మెప్పించిన అనుష్కకు రాజమౌళి ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'బాహుబలి' సిరీస్ పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ తెచ్చిపెట్టింది. ఈ చిత్రం భారీ వసూళ్లతో సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించగా.. అనుష్క శెట్టి పేరు కూడా దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. బాహుబలి తర్వాత సినిమాల ఎంపికలో కాస్త జాగ్రత్త తీసుకుంటున్న అనుష్క.. ఇటీవల 'ఘాటి' చిత్రంలో నటించింది. నివేదికల ప్రకారం ఆమె ఆస్తుల విలువ రూ.133 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. ఒక్కో సినిమాకు రూ.6 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటూ, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా ఏటా కోట్ల రూపాయల ఆదాయం సంపాదిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మలయాళంలో 'కథనార్ ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్న అనుష్క.. నాగార్జున 100వ సినిమాలోనూ కనిపించే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. సోషల్ మీడియాకు దూరంగా వ్యక్తిగత జీవితాన్ని ప్రైవేట్‌గా గడుపుతున్న అనుష్క శెట్టి ప్రస్తుతం 44 ఏళ్ల వయసులోనూ పెళ్లికి దూరంగా ఒంటరిగా ఉంటూ తన జీవితాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలుస్తోంది.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. RNI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com